# మారేవిలువలు

కొడుకు దగ్గిర్నుంచి వొచ్చిన వుత్తరం రామబ్రహ్మంగారు చదువుకుని, బల్లమీద పడేసి, మళ్లీ పుస్తకం చదవడంలో లీనమైపోయేరు. "ఎవరి దగ్గిర్నుంచీ వుత్తరం?" అంటూ వొచ్చిన భార్య పార్వతమ్మగారు ఆయన నిర్లిప్తంగా అందించిన వుత్తరం అందుకుని దస్తూరీ, అమెరికా ఎడ్రసు చూసి చిన్న కొడుకు కృష్ణ దగ్గిరనుంచని గ్రహించి "ఏం రాశాడు! రాయడానికి కొత్త విశేషాలేముంటాయి లెండి! వెళ్లి నెల్లాళ్లవ్వలేదు, వారం రోజులక్రితం ఫోన్‌కూడా చేశాడు!" అంటూనే వుత్తరం విప్పి చదువుకుంటూ ఆ వుత్తరంలో కొడుకుని చూస్తున్నంత తన్మయత్వం పొందింది. ఉత్తరం చదువుకున్నాక ఆవిడనుకుంది- ఈయన ధోరణే అంత! వాడు అమెరికా వెళ్లడం ఈయనకిష్టంలేదు. మాతృదేశం, మాతృభాష, భారతీయ సంస్కృతి అంటూ లెక్చర్లివ్వడం మొదట్నుంచీ అలవాటు.

ఇక్కడ ఐ.ఐ.టిలో గోల్డ్‌మెడల్ సంపాదించేడు. అమెరికాలో వున్న మూడు యూనివర్సిటీలు ఫెలోషిప్ ఇస్తామన్నాయి. చదువులైపోగానే మూడేళ్లలో తిరిగొచ్చేస్తానంటున్నాడు. కావాలన్నప్పుడు ఇటువంటి అవకాశాలొస్తాయా! ఆయన నోరు విప్పి వెళ్లిరా అనలేదు. తెగించే నేనే "ఆయన ఆశయాలు నమ్మకాలు మనకి కొత్తేమికాదు. ఆయన నోటితో ఆయన వెళ్లమనరు. డబ్బు నేనిస్తాను ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకో" అన్నాను. ఆయన నవ్వుకుని వూరుకున్నారు. కృష్ణ ఆనందంతో ఎగిరిగంతేసేడు.

రామబ్రహ్మంగారు గవర్మమెంట్ ఆఫీసర్‌గా రిటైరై రెండుసంవత్సరాలైంది. గౌరవంగా కాలక్షేపం చేసుకోడానికి కావాల్సిన ఆర్థిక స్తోమతవుంది. తన పెద్దరికాన్ని నిలబెట్టుకుంటూ, తన చుట్టూ వున్న బంధు మిత్రుల కష్టసుఖాల్లో పాలు పంచుకోవడమే ఆయన కల్పించుకున్న వ్యాపకం.

రిటైరైనప్పట్నుంచీ రోజూ సాయంత్రం ఐదున్నరకి బయల్దేరి నడిచి పార్క్‌కి వెళ్లడం అక్కడ స్నేహితుల్తో ఓ అరగంట కబుర్లు చెప్పి ఏడింటికల్లా తిరిగి రావడం పరిపాటి. ఆరోజు ఉదయం కాలిజోడు తెగిపోయింది. తనే నడిచివెళ్లి వీధి చివరవున్న జోళ్ల షాపులో కుట్టించుకుందామని జోళ్లు సంచీలో పెట్టుకుని బయల్దేరుతుంటే, అది చూసిన పెద్దకొడుకు చంద్రం సంచీలాక్కుని రిపేరుచేయించి సాయంత్రం ఆఫీసునించి తిరిగొచ్చేటప్పుడు

తెస్తానన్నాడు. అప్పుడే అయిదుంపావయింది. వాడురాలేదు. వాడికి జ్ఞాపకముండాలి, టైముండాలి, రిపేరవ్వాలి, తేవాలి. ఇవ్వాళ వాకింగ్ యోగంవుందో లేదో!

వాడు తేకపోయినా ఆశ్చర్యం లేదు. ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. పొద్దున్న వెడితే సాయింత్రానిక్కాని రాడు. ఇంటి బాధ్యతలన్నీవాడే మోస్తున్నాడు. వాడికి ముప్ఫయ్యేళ్లొస్తున్నాయి. గతనాలుగేళ్ల పట్టీ పెళ్లితలపెట్టినప్పుడల్లా ఏదోఅవాంతరాలు వొస్తూనేవున్నాయి. వాడికి వాడి అక్కయ్యంటే ప్రాణం. దానికాపరంలో ఒడుదుడుకులు, అల్లుడి అలకలు, గొంతెమ్మకోరికలు, ఒక ఎబార్షనూ, రెండు సిజేరిన్ కాన్పులు, నాబ్లడ్ ప్రెషర్ రోగం, నిరుడొచ్చిన హార్టెటాక్- ఎప్పటికప్పుడు ఏదో సమస్యలతో వాడి పెళ్లి వాయిదాపడుతూ వొచ్చింది.

చిన్నాడు కృష్ణ చదువు మద్రాసులో. చదువు పూర్తయింది. ఇక్కడే వుద్యోగం చూసుకుని కాస్త చంద్రానికి సాయంగా యింటి బాధ్యతలు పంచుకుంటాడనుకుంటే దేశాన్నే విడిచిపెట్టి పోయేడు. డబ్బు, హోదా, అధికారం మీదవుండే వ్యామోహం ముందు మమకారాలు అనుబంధాలు నిలుస్తాయా! “పుత్రా! వెళ్లు డబ్బు సంపాదించు. డబ్బుకిమించిన పరమార్థంలేదు” అని కన్నతల్లే మంత్రోపదేశం చేస్తుంటే, ఇది కాలమహిమ కాక మరేమిటి! ఇంత చిన్న వయస్సులోనే అంత డబ్బు ఆ జీవనశైలి, స్థాయి రుచిచూస్తే మన దేశమంటే వెగటుపుట్టదా! తెలివైన ప్రతీవాడూ విదేశాలకి పోతుంటే మన దేశం మన సంస్కృతిగతేమిటి! వీడు తిరిగొస్తాడన్న నమ్మకం లేదు. కష్టసుఖాలు పంచుకోవాలనే సాంప్రదాయానికి కట్టుబడిన ఈ కుటుంబవ్యవస్థకింక తిలోదకాలే. పాపం! ఈ యేడైనా చంద్రం పెళ్లి చెయ్యాలి. కారు ఆగిన చప్పుడు, గేటు తీసిన చప్పుడుతో రామబ్రహ్మంగారి ఆలోచనలకి అంతరాయంకలిగింది.

చంద్రం చేతిలోవున్న పేకట్ విప్పి కొత్తజోళ్లజత రామబ్రహ్మంగారి కాళ్లముందరపెట్టి “రిపేర్ చేసినా అవి పనికిరావు, సోల్స్‌కూడా అరిగిపోయాయి. ఇవివేసుకోండి. వాకింగ్‌కికూడా కంఫర్టబుల్‌గా వుంటాయి” అన్నాడు. ఆయనలేచి నిలబడి చంద్ర బుజంమీదో చెయ్యివేసి జోళ్లల్లో కాళ్లుపెట్టి తొడ్డుక్కుని సంతృప్తి పడి చంద్రం భుజం ఆప్యాయంగా చరిచేరు.

పార్వతమ్మ కృష్ణదగ్గిర్నుంచి వచ్చిన వుత్తరం చంద్రానికిచ్చింది. అది చదివి “వెరీగుడ్! నెలకి పదిహేనువందల డాలర్లు ఎలవెన్స్ యిస్తారుట. లక్కీఫెలో!” అన్నాడు. “అంటే నలభయ్యయిదు వేలరూపాయలు నెలకన్నమాట” అంది ఆవిడ, భర్తకి వినపడేటట్లుగా.

ఆయన చిరునవ్వు నవ్వుకుంటూ స్టాండ్‌నున్న దంతం పిడి చేతి కర్ర తీసుకుని హుందాగా బయటికి నడిచేడు. ఇంకా వాడి భవిష్యత్తులో డాలర్లలో సంపాదన, రూపాయలలోవాటి విలువ గురించి చేసుకునే వ్యాఖ్యానాలు ఆయన ఊహించగలడు. సాయింత్రం పార్క్‌లో మిత్రులతో పిచ్చాపాటీగా చెప్పుకోవడంలో, కొందరు విదేశాల్లో వున్న కొడుకులు కూతుళ్ల తాలూకు సంపాదన, సదుపాయాలు, సరదాలు, సంస్కారం దండకంలాగ పారాయణం చెయ్యడం, తను ఎంతో ఆసక్తిగా ఆశ్చర్యంగా వింటున్నట్టు నటించి వాళ్ల అదృష్టాన్ని అభినందించడం ఆయన నిత్య విధుల్లో ఒకటి.

★ ★ ★

చంద్రం చూసిచూసి చివరకు నిర్మలనే స్కూల్ టీచర్ని పెళ్లాడతానంటే కన్నతల్లి మనస్సు చివుక్కుమంది. కట్నం మీద ఆశమూలంగా కాదు, పెద్ద సంబంధాలొస్తుంటే ఎంతో గర్వంగా కొడుకు అదృష్టాన్నిగురించి అంచనాలేస్తూ వొచ్చింది. భర్తయినా తన పక్షాన వుండి వాదిస్తాడనుకుంటే నిరాశేఎదురైంది. ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా కష్టసుఖాలు తెలుసుకుని సంసార బాధ్యతను పంచుకునే యిల్లాలు కావాలనుకోవడంలో స్వార్థంకంటే పరమార్థమే ఎక్కువ వుందని గ్రహించి కొడుకు నిర్ణయానికి తండ్రి సంతోషించేడు.

నిరాడంబరంగా పెళ్లి జరిగిపోయింది. కృష్ణ అమెరికా వెళ్లి ఏడాదే అయింది. ఇంత త్వరలో రావడమంటే ఖర్చు, చదువుకి అంతరాయం, వొచ్చినా పదిరోజులైనా వుండటానికి లేదు. అంచేత కృష్ణ అన్నగారి పెళ్లికి రాలేదు. పెళ్లినాడు నూతన దంపతులకి టెలిఫోన్లో అభినందనలు తెల్పుతూ, పెళ్లితాలూకు వీడియో కేసట్ తనకి పంపమన్నాడు కృష్ణ. పెళ్లయిన పదిరోజులకి అమెరికా నుండి ఇండియా వస్తున్న స్నేహితుడిద్వారా అందరికీ కృష్ణ బహుమతులు పంపేడు. ఎవరు సరిపెట్టుకున్నా పార్వతమ్మ మాత్రం కృష్ణ పెళ్లికిరానందుకు లోలోనే కుమిలిపోయింది.

చదువు పూర్తవ్వగానే కృష్ణకు అమెరికా ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించింది. దానికి సాయం అక్కడే పుట్టిపెరిగిన రేఖని పెళ్లి చేసుకుంటే తన జీవితం ఎంతో మహోజ్వలమౌతుందో వివరిస్తూ కృష్ణ వుత్తరం రాశాడు. రేఖ తల్లితండ్రులిక్కడి వాళ్లేకాని పాతికేళ్లుగా అమెరికాలో స్థిరపడ్డారు. నాలుగైదేళ్లకోసారి ఇండియావొచ్చి ఇక్కడ ఆస్తిపాస్తుల్ని కొద్దిగా కొద్దిగా అమ్మి ఆ డబ్బుని అక్కడికి జారేసుకుంటూ వుంటారు. ఈ పరిణామం పార్వతమ్మగారికి అనూహ్యమైంది. చదువుపూర్తి చేసుకుతిరిగొస్తానంటే పంపేముకాని

పెళ్లంటాడేమిటి అంటూ దిగ్భ్రాంతి చెందింది. అమెరికాలో వున్న అమ్మాయిని పెళ్లాడితే వీడింక ఇండియా తిరిగొస్తాడా! దీనికి భర్త ఒక్కనాటికి ఒప్పుకోరు అనుకుంది. చెట్టంతకొడుకు, బాగా చదువుకున్నవాడు, తెలివైనవాడు, అంత ఆలోచించుకుని రాస్తే తల్లిదండ్రులుగా తమ గౌరవాన్ని నిలబెట్టుకుంటూ 'మంచిది నాయనా!' అనాలి కాని వొద్దన్నా మానెయ్యడని రామబ్రహ్మంగారికి తెలుసు.

పెళ్లిమాత్రం ఇండియాలోనే జరగాలని నిర్మలాచంద్రం పట్టుపట్టేరు. కృష్ణ వాళ్లని ఒప్పించేడు. నూతన దంపతుల కనుకూలంగా వుండేలాగ చంద్రం తమ్ముడికోసం అల్ట్రా మోడర్న్ ఫర్నిషింగ్స్‌తో బెడ్‌రూం తయారు చేయించేడు. పెళ్లీ రిస్పెప్షనూ ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో వైభవంగా జరిగేయి. రేపు పెళ్లనగా అందరూ అమెరికానుంచి దిగడం, అక్కడే వుండటం, ఎప్పుడో పెళ్లయిన దంపతుల్లాగ పెళ్లికొడుకూ పెళ్లికూతురూ చట్టాపట్టాలేసుకు తిరిగడం, యాంత్రికంగా పెళ్లితంతులో పాల్గొనడం, అసలు పెళ్లి తంతంతా ఓ గంటకి కుదించడం, పెళ్లికి ముందు దేనికీ కొడుకు తనతో సంప్రదించకపోవడం, అన్నింటికీ భర్తతలూపడం కొడుకు పెళ్లికి తను కేవలం ఒక ప్రేక్షకురాలిగా మిగిలిపోవడం- ఇదంతా పార్వతమ్మగారికి కొరకబడని కొత్త అనుభవం.

పెళ్లయిన తర్వాత కృష్ణ భార్యతోనూ అత్తమామలతోనూ ఆవూరు యీవూరు తిరుగుతూవుండగా వాళ్లు యిక్కడ వుండటానికి వొచ్చిన పదిరోజులు గడువూచూస్తూండగానే గడిచిపోయింది. రక్తమాంసాలు ధారపోసి కనిపెంచిన తల్లి ఇంత అర్థాంతరంగా కొడుకు తిరిగి వెళ్లిపోతే ఎంత బాధపడుతుందో తెలిసిన నిర్మల కృష్ణ భార్యతో తిరుగు ప్రయాణం పదిరోజులు వాయిదా వెయ్యమని నిర్బంధించింది. రేఖ వుండటానికి వీల్లేదుకనక తల్లితండ్రులతో తిరిగివెళ్లిపోయింది. కృష్ణ పదిరోజులుండటానికి అంగీకరించేడు. దంపతులిద్దరికీ పదిరోజులు యింట్లో వుంచుకుని కృష్ణ కిష్టమైన వంటలతో విందు చెయ్యాలనుకుంది పార్వతమ్మగారు. కోడలు వెళ్లిపోవడంతో సగం ఉత్సాహం అంతరించింది. పోనీ కొడుక్కయినా వొండిపెదామనుకుంటే మర్నాటి నుంటే కృష్ణ ఆరోగ్యం దెబ్బతింది.

అయిదేళ్లు అమెరికాలో వుండి వొచ్చిన కృష్ణకిప్పుడు ఈ భూమి, ఈగాలి, ఈ నీరు, ఈ తిండి, ఈ వాతావరణం పడవన్నమాట పార్వతమ్మకి తెలియదు. విందు భోజనం మాట దేవుడెరుగు, కృష్ణకు లంఖణాల్లో సేవచేసి పథ్యం పెట్టి పంపడమే గగనమైపోయింది. పార్వతమ్మ అమాయకత్వానికి రామబ్రహ్మంగారు తనలోతనే నవ్వుకున్నారు. మూడేళ్ల చదువుకోసం వెళ్లి అయిదేళ్లక్కడ వుండటం చూశాక కొడుకు ఆశయాలు ఆకాశన్నంటుతున్నాయని గ్రహించేడు.

కృష్ణ జీవితం అమెరికాలో ఎంత జాజ్వల్యమానంగా వుందో టెలిఫోన్ ద్వారానూ, అక్కడ నుంచిపంపించే ఆడియోవీడియో కేసట్ల ద్వారానూ తెలుస్తూనే వున్నాయి. అయితే రానురాను పార్వతమ్మగారికి అవిచూసి వినే ఆసక్తి కూడా సన్నగిల్లింది. "మీరందరూయిక్కడికి రండి, టిక్కట్లునేనే కొనిపంపుతాను, ఇక్కడ మీరు వుండటానికి తిరగటానికి కావల్సిన ఏర్పాట్లన్నీ చేస్తాను" అంటూ కృష్ణ చాలాసార్లు రాసేడు. తనకి కావల్సింది అమెరికాకాదు తమ కలలుగన్న కొడుకు దగ్గర్నుంచి ఆశించిన ఆప్యాయత. అక్కడి కెళ్లినా అది దొరుకుతుందన్న నమ్మకం లేదు. తల్లిగా ఆమె ప్రేమస్వరూపిణి. ఆమె అందించేదీ ఆశించేదీ ప్రేమే. ఎక్కడతన ప్రేమకి విలువలేదో అక్కడ ఆమె నిలవలేదు.

★ ★ ★

చంద్రం కొడుక్కి రెండేళ్లొచ్చాయి. రామబ్రహ్మగారి వొళ్లో కూర్చుని, తన పెర్మిషన్ లేకుండా ఆయన వార్తా పత్రిక చదవడంలో నిమగ్నుడవ్వటానికి నిరసనగా ఆ పత్రికని లాక్కుని చింపెయ్యబోతుంటే, తన తప్పుతెలుసుకుని వాణ్ణి బుజ్జగించి అందులో బొమ్మలు చూపెడుతూ వాటికి కొత్త అర్థాలు కల్పించి వ్యాఖ్యానిస్తున్నాడు. నిర్మలొచ్చి మావగారి వొళ్లోంచి పిల్లాణ్ణి చేతుల్లోంచి పేపర్ని తీసుకుని పక్కనపెట్టి, తను తెచ్చిన టాబ్లెట్టు, కాఫీకప్పు చేతుల్లో పెట్టింది. తనకి సింహాసనానికి లోటు లేదని రుజువు చెయ్యడానికి పిల్లాడు వెళ్లి అమాంతంగా బామ్మవొళ్లోకి గెంతేడు. ఆ ఊపుకి ఆవిడ చేతిలో వున్న పత్రిక ఎగిరిఆమడ దూరానపడింది. వాణ్ణి చేతుల్లోకి తీసుకుంటూ "ఈ రోజు సాయింత్రం ఏడున్నరవరకూ సప్తమి తిథి, పైగా గురువారం, రేఖకి పురుడొచ్చే టైమేమరి, టెలిఫోన్ రావాలి" అంటూ పార్వతమ్మగారు కొంచెం గట్టిగానే గొణుక్కుంది, తన గంటల పంచాంగం ప్రపంచవ్యాప్తంగా కాలమానానికి అన్వయిస్తుందన్నట్టు. "నిన్న సాయంత్రం నర్సింగ్‌హోంలోఎడ్మిట్ చేసేరు. పన్నెండు గంటల్లో పురుడొస్తుందన్నారు. మీరు చెప్పిన గడువులో తప్పక రేఖ మగపిలాణ్ణి కంటుంది... చూస్తూ వుండండి ఓగంటలో ఫోన్ వొస్తుంది." అంది నిర్మల. 'కొడుకు పుట్టినా, కూతురు పుట్టినా అమెరికన్ సిటిజన్. ఈ దేశం మీద ఈ మనుషులమీద తల్లితండ్రులకి లేని మమకారం సంతానికుంటుందా' అన్న భావంతో లాగుంది రామబ్రహ్మంగారు తనలోతనే నవ్వుకున్నారు.

★ ★ ★

ఏ నోటీసులేకుండా, హటాత్తుగా గుండెపోటొచ్చి రామబ్రహ్మంగారు పోయేరన్నవార్త పోయినగంటలో కృష్ణకి తెలిసేటప్పటికి దుఃఖం మాటెలాగున్నా చిరాకెత్తిపోయేడు. ఎంతో ముఖ్యమైన పనుల్లో ఊపిరిసలపకుండా మునిగివున్న ఈ సమయంలో ఈ వార్తయేమిటి!

ఇప్పుడుతనేమిచెయ్యాలి? వెంటనే అత్తమామల్నీ భార్యనీ సమావేశపరిచేడు. అయిదు నెల్ల చంటిపిల్లని వెంటబెట్టుకుని రేఖ ఇండియాకు రానంది. అవును మరి ఆ అపరిశుద్ధ పరిసరాల్లో చంటిపిల్ల ఆరోగ్యం గురించి ఆందోళన పడటం సబబే. ఇప్పుడు నెత్తినవున్న బాధ్యతలు దృష్ట్యా ఎంత వెంటనే బయల్దేరినా అంత్యక్రియలకు అందుకోలేదు. నిజమే. లేటుగావెళ్లి ఏం లాభం! మళ్లీ పన్నెండో రోజు తర్వాత వుండకూడదు. తండ్రికి సీరియస్‌గా వుందని వార్తొస్తే వెళ్లి పలకరించవచ్చున్న సంతృప్తయినా వుంటుంది. ఇప్పుడయితే కేవలం అమ్మని ఓదార్చడానికి వెళ్లాలి. అది అన్నయ్య ఎలాగైనా చేస్తాడు. తర్వాతయితే తీరుబడిగా పదిరోజుండొచ్చు. అప్పుడు ఆవిడా సంతోషిస్తుంది. ఇలా ఆలోచించి అన్నగారికి ఫోన్ చేసి ఒకసారి ఘొల్లుమని తర్వాత తనుత్వరలోనే వస్తున్నానని కృష్ణ చెప్పేడు.

★ ★ ★

తండ్రిపోయిన రెండు నెలలుక్కాని కృష్ణ ఇండియారావడం కుదర్లేదు. వారంరోజుల తర్వాత కృష్ణ తిరుగు ప్రయాణం ప్రసక్తి తెచ్చేడు. పొరుగింటి నుంచి ఎరువుతెచ్చుకున్న వస్తువును త్వరగా తిరిగి పంపడం ధర్మం. అందుచేత ఇంకొన్నాళ్లుండమని తల్లి కృష్ణను నిర్బంధించలేదు. అమ్మకూడా కాలంతోబాటూ మారింది అని సంతోషించేడు కృష్ణ.

* *వనితాజ్యోతి, 1995*